రచన - అక్టోబరు 2004

# వరసిద్ధులు

మొదటి గంట మరో పదిహేను నిముషాలలో ముగుస్తుందగా, ఉపదేశికుల విశ్రాంతి గదిలో కూర్చున్న నాకు కళాశాల అధ్యక్షుల వారి కబురంది ఆయన గదికి వెళ్ళాను.

కూర్చోమని అనకుండానే తన గోడు చెప్పుకొన్నాడు.

"పన్నెండో తరగతి 'బి' సర్గకి రెండవ గంట గణితం. గణితోపాధ్యాయుడు భాస్కరావు అదృశ్యమైపోయాడు! అందుచేత మీరాగంటలో ఏదైనా పాఠం చెప్పండి!"

నేను కొత్తగా బదిలీ అయి వచ్చిన ఆ కళాశాలలో, చాలామంది అధ్యాపకులు ముందుగా అదృశ్యమైపోయి ఆలస్యంగా ప్రత్యక్షమవుతుంటారు! అయితే విచిత్రమేమిటంటే - ఇక్కడ కళాశాల నుంచి అదృశ్యమైపోయిన వాళ్ళు ఏ శిక్షణా తరగతుల కేంద్రంలోనో ప్రత్యక్షమై, విద్యావికాస విన్యాసాలు చేస్తూ, చేయిస్తూ అదనపు ధనార్జన చేస్తూ ఉంటారు. ఈ సంగతి అందరికీ తెలుసు - కళాశాల అధ్యక్షులవారికీ తెలుసు. తెలిసీ దండించే ధైర్యం ఆయనకెందుకు లేదో నాకు తెలియదు కాని, ప్రధానోపదేశికుల వారి ఆజ్ఞని తిరస్కరించే ధైర్యం లేనివాణ్ణీ, శిరసావహించే సంస్కారవంతుణ్ణీ కాబట్టి, "అలాగే, మీరు నిశ్చింతగా ఉండండి" అని బయట పడ్డాను.

రావల్సిన గణితోపాధ్యాయుడి స్థానంలో కొత్త శాల్తీని చూసిన విద్యార్థులు కాస్త విస్తుబోయినా, కుతూహలం కొద్దీ నిశ్శబ్దం పాటించారు.

"నా పేరు..... మీ కళాశాలకి బదిలీ మీద వచ్చిన భౌతికశాస్త్రోపదేశికుణ్ణి. మీ గణితోపాధ్యాయులవారీ రోజు కళాశాలకు రాలేదుట. అందుకని మీ తరగతి తీసుకోవలసిందిగా నాకు ఆదేశమివ్వబడింది. మరి మీకే పాఠం చెప్పమంటారు?" - ముందుగా పరిచయం చేసుకొని, తర్వాత కారణం చెప్పి, చివరగా ప్రశ్నించాను.

"ఆయనకిదే అలవాటు సార్! 'రుబ్బా' శిక్షణా కేంద్రంలో ఇంకో పావుగంటలో ఆయన పాఠాలు మొదలవుతాయి. మాలో కొంతమంది ఆ కేంద్రంలో కూడా రుసుములు చెల్లించాం. మేమిప్పుడు వెళ్ళాలి" అన్నాడో విద్యార్థి లేస్తూ. మరో పదిమంది అతనితో పాటు లేచారు.

"నిరభ్యంతరంగా వెళ్ళండి! వెళ్ళేముందు మీ పేరూ, సంఖ్యాక్రమమూ చెప్పి మరీ వెళ్ళండి. హాజరు పట్టీలో మీకు గైరుహాజరు వెయ్యాలి కదా! ఈ మధ్యాహ్నం రెండవ గంట మీ సర్గకి నేను భౌతిక శాస్త్రం పాఠం చెప్పాలి. దానిక్కూడా మీరు రానవసరం లేకుండా ఇప్పుడే గైరుహాజరు వేస్తాను. 'రుబ్బా' కేంద్రానికే వెడ్తారో, 'సుబ్బా' కేంద్రానికే వెడ్తారో మీ ఇష్టం" అన్నాను తీక్షణంగా చూస్తూ.

ఏమనుకొన్నారో ఏమో, అందరూ నెమ్మదిగా కూర్చుండి పోయారు.

"కావాలంటే మీకు గణితం చెప్పగలను. కాని అది నా కిష్టం లేదు. భౌతిక శాస్త్రం చెప్పగలను. కాని అది నాకు నిర్ధారించిన సమయంలోనే చెబుతాను. కాని ప్రస్తుతం ఈ సమయాన్ని వృథా

చెయ్యడం భావ్యం కాదు కదా? అందుకని భౌతిక శాస్త్రం బదులూ, గణిత శాస్త్రం బదులూ నైతిక విలువల్ని గురించిన కథ చెపుతాను."

❖ ❖ ❖

భాగీరథీ తీరాన ఉండే ఓ గురు కులాన్ని నందుడనే ప్రధానాచార్యుడు చాలా ఆదర్శ వంతంగానూ, అతి సమర్థవంతంగానూ, వర్గ, మత, కుల వివక్ష లేక నిష్పక్షపాతంగానూ నిర్వ హించేవాడు. గురుకులం కౌశాంబి రాజ్యంలో ఉన్నా, ఇతర రాజ్యాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి విద్య నభ్యసించే వారు. కౌశాంబి రాజ్య ప్రభువు ధర్మపాదుడు రాజకీయాలకతీతంగా, పర రాజ్యాల నుంచి వచ్చిన విద్యార్థులకు కూడా గురుకులంలో అన్ని సదుపాయాలు కలుగ జేసేవాడు.

ఒకానొక సమయంలో రాజు, మంత్రి, సేనాని, కోశాధికారుల సమవయస్కులైన కుమారులు ఆ గురుకులంలో విద్యనభ్యసించడం తటస్థించింది. వారు నలుగురూ ఉత్సాహవంతులైన యువకులు, స్నేహితులు. గురుకుల నియమాలను పాటిస్తూ విద్యనభ్యసించేవారు.

ఓ రోజు సాయంత్రం సూర్యాస్తమయమవుతూన్నప్పుడు వారు భాగీరథీ తీరాన కూర్చుని కబుర్లాడుకుంటున్న సమయంలో, కాస్త దూరంగా నదిలో ఎవరో కాషాయ వస్త్రాలు ధరించిన వ్యక్తి మునుగుతూ, తేలుతూ కొట్టుకుపోతూండడం చూసి గట్టిగా కేకలు వేశారు. గట్టుకి దిగువగా గోవుల చేత నీరు తాగిస్తున్న పశువుల కాపరి గోపన్న వీళ్ళ అరుపులు విని, నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని చూసాడు. వెంటనే నీటిలోకి దుమికి, వేగంగా ఈదుకొంటూ పోయి, ఆ వ్యక్తిని ఒడిసి పట్టుకుని ఒడ్డుకు చేర్చాడు. వాళ్ళు నలుగురూ ఆ వ్యక్తి ఇంకా ఊపిరితో ఉన్నాడని గ్రహించి, ఛాతీ మీద నొక్కి మింగిన నీటిని కక్కించారు. తర్వాత ఆ వ్యక్తిని గోపన్న సాయంతో మోసుకువెళ్ళి గురుకులంలోని చికిత్సాకేంద్రంలో పడుకోబెట్టి, అటు తర్వాత వెళ్ళి ఆచార్యుడు నందుడికీ విషయం చెప్పారు.

నందుడా వ్యక్తిని పరీక్షించి, ఏవో కొన్ని ఔషధాలిచ్చి, "ఈయన పూర్తిగా కోలుకోవడానికి వారం రోజులు పడుతుంది. మీరు నలుగురూ ఇతర విషయాలు పట్టించుకోకుండా ఈయనకు సపర్యలు చేస్తూండండి. గోపన్నా, నీ మందలోని తెల్లమచ్చల నల్లావు పాలు ప్రతిరోజూ ఉదయం తీసుకువచ్చి, ఓ లోటాడు ఈయన చేత తాగిస్తూ ఉండు. మీ యాజమానితో నే చెబ్తాలే" అని వాళ్ళయిదుగురికీ ఆదేశాలిచ్చాడు.

ఆ వ్యక్తి మహేశ్వరుడనే యోగి. నదికి ఎగువగా ఉన్న కొండల్లో తపస్సు చేసుకొంటూ ఉంటాడు. యధావిధి భాగీరథిలో సాయంత్రపు స్నానం చెయ్యాలనే సంకల్పంతో దిగి వస్తుండగా, ఓ విషపు పురుగు కుట్టి, స్పృహ తప్పి దొర్లుకుంటూ పోయి నదిలో పడ్డాడు.

వారు చేసిన పరిచర్యలతో నందుడు చెప్పిన రీతిగానే ఆయన వారం రోజుల్లో పూర్తి స్వస్థత చెందాడు. మహేశ్వరయోగి నందుని అనుమతి తీసుకొని వారయిదుగుర్నీ ఉద్దేశిస్తూ అన్నాడు.

"మీరు చేసిన సేవలకు నేను త్వరగా కోలుకున్నాను. అందుకు ప్రతిఫలంగా మీకు

వరాలివ్వాలని అనిపిస్తోంది. మీరు నేను చెప్పినట్టు చెయ్యండి. రేపు ఉదయం భాగీరథీ తీరాన మీరు ప్రతినిత్యమూ కూర్చునే స్థలంలో ఉన్న నేరేడు చెట్టును ఎక్కండి. దానికి అయిదు ప్రధాన శాఖలున్నాయి. ఒక్కొక్కరూ ఒక్కొక్క కొమ్మని ఎంచుకొని చూస్తే, వేలాడుతున్న నేరెడు పళ్ళ గుత్తుల్లో సువర్ణ వర్ణం గల ఒక్కొక్కపండు కనపడుతుంది. ఆ పండును కోసుకొని, ఆ కొమ్మ సూచించే దిశలో ప్రయాణం చెయ్యండి. మొదటిసారిగా మీకు దప్పిక కాని, ఆకలి కాని ఎప్పుడైతే వేస్తుందో అప్పుడా సువర్ణ ఫలాన్ని తినండి. అయిదో రోజుకి గురుకులం తిరిగి చేరుకోండి. ఆ ఫల మహిమ చేత మీకు తిరిగి వచ్చేవరకూ మరి ఆకలి, దప్పికలుండవు. ఆ రోజుకి నేను తిరిగి వచ్చి మీకేయే వరాలివ్వాలో నిర్ణయిస్తాను."

మహేశ్వర యోగి వాళ్ళనాశీర్వదించి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం అందరూ నది 'ఒడ్డునున్న నేరేడు వృక్షం దగ్గరకు వెళ్ళారు. రాజు కొడుకు వసంతుడు ఉత్తర దిశగా ఉన్న కొమ్మ నెంచుకుని, ఆ కొమ్మని ఎక్కి సువర్ణ ఫలాన్ని కోసుకుని దిగి, అశ్వారోహణ చేసి ఉత్తర దిశగా పయనించాడు. అదేవిధంగా మంత్రికొడుకు వేదుడు దక్షిణదిశగా, సేనాపతి కొడుకు అజయుడు తూర్పు దిశగా, కోశాధికారి కొడుకు కుబేరుడు పశ్చిమ దిశగా ప్రయాణం చేశారు.

గోపన్నకు మిగిలిన కొమ్మ దిశలోనే గురుకులం ఉంది. గోపన్న సువర్ణ ఫలాన్ని తీసుకొని గురుకులంలోని నందుని వద్దకు వెళ్ళి, "అయ్యావారు మన్నించాలి. ఈ గోవుల్ని వదిలి అయిదు రోజుల పాటు వెళ్ళడం నాకు సాధ్యం కాని పని, అందుకని ఈ ఫలాన్ని మీ వద్దనే ఉంచుకొని, ఆ స్వాముల వారు వచ్చిన తరువాత నా మీద ఆగ్రహం చెందకుండా చూడండి," అన్నాడు వినయపూర్వకంగా.

నందుడు చిన్నగా నవ్వుతూ, "గోవులన్నీ ఈ గురుకుల ప్రాంతంలోనే పచ్చిక మేస్తుంటాయి కదా? అందుకని ఎప్పటిలాగే గురుకులం దగ్గరగానే ఉండి నీ యజమానుల గోవుల్ని కాస్తూ ఉండు. కానీ నీకు ఎప్పుడు దాహం కాని, ఆకలి కాని వేస్తే సువర్ణ ఫలాన్ని తప్పక తినాలి సుమా!" అని నచ్చచెప్పి పంపించేశాడు.

ఉత్తర దిశగా వెళ్ళిన వసంతుడు మధ్యాహ్నవేళకు తమ రాజ్యపు సరిహద్దులు దాటి ఉత్తరాంచల్ అనే దేశంలో అడుగు పెట్టాడు. వసంతుడికో పాడుబడిన దేవీ ఆలయం కనపడింది. అక్కడ గుర్రాన్ని దిగి, ఆలయం పక్కనే ఉన్న కొలనులో దాని చేత నీళ్ళు తాగించి, తర్వాత పచ్చిక మేయడానికి వదిలాడు. తనూ కాళ్ళూ, చేతులూ, మొహమూ కడుక్కొని ఆకలనిపించడంతో సువర్ణ ఫలాన్ని తిన్నాడు. కొద్ది క్షణాల్లోనే వసంతుడి ఆకలి దప్పులు మటుమాయమయ్యాయి.

సరిగా అదే సమయంలో కొంతమంది బాటసారులు గుడి వద్దకు చేరి, మండపం ఎదురుగా ఉన్న మర్రిచెట్టు కింద కూర్చుని, తాము కూడా తెచ్చుకొన్న మూటల్ని విప్పి భోజనానికి ఉపక్రమించారు.

"ఎవరిదబ్బా ఈ అశ్వం? చాలా గొప్పగా ఉంది!" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"ఏవేటకో వచ్చిన రాకుమారుడిది కావొచ్చు, లేదా ఎవరైనా బందిపోటు దొంగది కావచ్చు!

దాని గొడవ మనకెందుకు? మనం వెళ్ళేలోగా దాని యజమాని వస్తే, ఎవరో తెలుస్తుంది" అన్నాడు మరొకడు.

వసంతుడికి ఆశ్చర్యం వేసింది. తను వాళ్ళ కెదురుగా మండపంలో కూర్చుని ఉన్నా, తనక్కడ లేనట్టే ప్రవర్తిస్తున్నారు! వసంతుడికేదో అనుమాన మొచ్చింది. వెళ్ళి కాస్త దూరంగా ఉన్న ఓ బాటసారి ముందు కూర్చుని, అతను నీళ్ళు పెట్టుకున్న సత్తుగిన్నెనోసారి ఎత్తి కింద పెట్టాడు.

"ఓర్నాయనోయ్! నీళ్ళ గిన్నె దానంతట అదే పైకి లేచి కిందకు దిగింది. ఇదేదో గాలిదెయ్యంలా ఉంది!" అంటూ భయంతో ఆబాటసారి అరిచాడు.

వసంతుడు తను అదృశ్యరూపంలో ఉన్నట్టూ, అది సువర్ణఫల మహిమ అనీ గ్రహించాడు.

"మన రాజుగారి ఆస్థాన నర్తకి చిత్రలేఖని చూసిన తర్వాత నీకు మతి భ్రమించినట్టుంది! వెర్రివేషాలెయ్యక భోజనం త్వరగా ముగించు! మనమింకా చాలా దూరం పోవాలి", అన్నాడు, మరో బాటసారి.

వసంతుడు నెమ్మదిగా గుర్రాన్ని వాళ్ళకి కనుపించనంత దూరం వరకూ నడిపించుకుని వెళ్ళి, ఒక్క గెంతుతో ఎగిరి కూర్చుని దౌడు తీయించాడు. రౌతు లేకుండా పరుగెడుతున్న గుర్రాన్ని దారిలో కొంతమంది చూసి ఆశ్చర్యపోయారు. చీకటి పడేవేళకు వసంతుడు ఉత్తరాంచల్ రాజధాని 'దేహరధామం' చేరుకొన్నాడు.

గుర్రాన్ని ఊరి వెలుపలనున్న కాలభైరవుడి ఆలయం దగ్గర వదిలి, కాలి నడకన నగరంలో ప్రవేశంచి రాజప్రసాదం చేరుకున్నాడు. ఓ ద్వారం గుండా జనాలు కోటలో ప్రవేశిస్తున్నారు. వారి మాటలను బట్టి రాజనర్తకి చిత్రలేఖ నృత్యప్రదర్శన జరగబోతోందని గ్రహించి, వసంతుడు కూడా కోటలో ప్రవేశించి నాట్యమందిరం చేరుకొన్నాడు. చుట్టూ పరికించి, అనుమానం కలుగని అనువైన స్థలాన్ని ఎంచుకొని నిల్చున్నాడు.

రాజనర్తకి చిత్రలేఖ నృత్యవేదిక మీదకు రాగానే నాట్యమందిరంలో నిశ్శబ్దం ఆవరించింది. ఉత్తరాంచల్ రాజు, రాణి, యువరాణి శశిరేఖ వచ్చి తమ ప్రత్యేక ఆసనాల్లో ఆసీనులయ్యారు. వసంతుడు చిత్రలేఖనీ, శశిరేఖనీ మార్చి మార్చి చూడసాగాడు. నృత్యం ప్రారంభమైంది. చిత్రలేఖ నృత్యం వసంతుడి హృదయాన్ని ఎంతగానో స్పందింపచేసింది. ఓ రెండు గంటల తర్వాత ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య నృత్యం ముగిసింది.

వసంతుడు చిత్రలేఖ వెనుకగా వెళ్ళి కోట ప్రాంగణంలోనే ఉన్న ఆమె నివాసంలో ప్రవేశించాడు. అలసిసొలసిన చిత్రలేఖ దాసీల సహాయంతో నాట్యాలంకారాల్ని తొలగించుకుని, దుస్తుల్ని వదలి, నగ్నంగా నడుచుకొంటూ వెళ్ళి తన నివాసంలోనే ఉన్న చిన్న చలువరాతి తటాకంలోకి దిగి సేద దీర్చుకోసాగింది. ఆమె సౌందర్యాన్నీ, కదలికల్నీ చూస్తూ వసంతుడు మైమరిచిపోయాడు. తమకం ఆపుకోలేక ఆమె పొందుకోసం రెండడుగులు ముందుకు వేసిన వసంతుడు, మహారాజు ప్రవేశంతో ఆగిపోవలసి వచ్చింది. పరిచారికలు పక్కకు తప్పుకొన్నారు. అటుపైన చిత్రలేఖ, మహారాజుల కామక్రీడలన్నీ కనువిందుగా చూసి, వసంతుడు భారమైన

హృదయంతో ఆ నివాసాన్ని వదిలాడు.

వసంతుడికి రాకుమార్తె శశిరేఖ మనసులో మెదిలింది. వెంటనే అంతఃపురం వైపు వెళ్ళాడు. ప్రవేశ ద్వారాలు మూసి, సైనికులు పహారా కాస్తున్నారు. అదృశ్య రూపంలో ఉండడం మూలాన నిర్భయంగా ఓ లత ఆధారంగా పైకి వెళ్ళి అంతఃపురంలో ప్రవేశించాడు. రాజకుమార్తె హంసతూలికాతల్పం మీద దేవతావస్త్రాలలో పడుకొని ఉంది. పక్కనే పరచి ఉన్న తివాచీల మీద నలుగురు చెలికత్తెలు చెదిరిన దుస్తులతో అదమరచి నిద్రిస్తున్నారు. రాజకుమార్తె నాజూగ్గా, అందంగా ఉన్నా అంగసౌష్టవం లేనిదిగా ఉంది. ఇద్దరు పరిచారకల అందాల్ని చూసి వసంతుడు మోహావేశపరుడైనాడు.

తన శరీరం మీద ఎవరివో చేతులు పడ్డట్టనిపించిన పరిచారిక వాసంతి నిద్రలోంచి మేలుకొని దిగ్గున కూర్చుంది. వంటి మీద దుస్తులు తొలగిన వైనం గమనించిన వాసంతి భయంతో కేక వేసింది. అందరూ లేవడంతో వసంతుడు దూరంగా జరిగిపోయాడు. అదృశ్యరూపంలో తాను చేసే ప్రయత్నాలు సంచలనాలకీ, అనర్థలకీ దారితీస్తాయని గ్రహించాడు వసంతుడు.

అటు తర్వాత వసంతుడు మరో మూడు రోజుల దేహారధామంలో తన అదృశ్యరూపంలో ఎందరో సుందరీమణుల దేహసౌందర్యాల్ని తిలకించి, ఎందరో కాముకుల ప్రణయలీలల్ని గాంచి అయిదో రోజు సాయంత్రానికల్లా గురుకులం చేరుకున్నాడు. గురుకులంలో అడుగు పెట్టగానే వసంతుని అదృశ్యరూపం పోయింది.

దక్షిణ దిశగా వెళ్ళిన వేదుడు కూడా సువర్ణ ఫలాన్ని తినగా తనకి అదృశ్యరూపం వచ్చిందని గ్రహించాడు. కాళింది రాజ్యానికి ముఖ్యపట్టణమైన కాశి చేరుకొన్నాడు. అప్పటికి కాశిలో సిద్ధార్థుడు, అమితాబుడు అనే ఇరువురు పృచ్ఛకులు సామాన్య జనాన్ని విషయ పరిజ్ఞానంలో ప్రశ్నలు వేసి, పదిహేను ప్రశ్నలకు సరయిన సమాధానాలు చెప్పే వారికి కోటి వరహాలు బహుమతినిచ్చేవాడు. ఆ బహుమతుల రొక్కాన్ని కాశిరాజు ఇచ్చేవాడు. వేదుడు వారి పృచ్ఛమందిరానికి వెళ్ళి, వాళ్ళు తయారుచేసుకొని సిద్ధంగా ఉంచుకొన్న ఓ పదిహేను వందల ప్రశ్నల్ని సమాధానాలతో సహా కంఠస్థం చేసి, అయిదో రోజుకల్లా గురుకులం చేరుకొని మామూలు రూపం పొందాడు. తర్వాత వీలుచూసుకొని కాశి వెళ్ళి, కోటి వరహాలు గెల్చుకోవాలని వేదుడు ఆలోచించాడు.

తూర్పు దిశగా పయనించిన సేనాని కొడుకు అజయుడు పాటలీపుత్రమనే నగరాన్ని అదృశ్యరూపంలో చేరుకున్నాడు. వాస్తవానికి అజయుడి తాత, ముత్తాతలు ఆ నగరానికి చెందిన వారే. కుల, వంశపక్షమైన కొన్ని కక్షల కారణంగా, అజయుడి ముత్తాతలు ఆరుగురు సోదరులు దారుణంగా వధించబడ్డారు. అజయుడి తాత కౌశాంబి రాజ్యానికి పరారి అయి, అక్కడ వలస స్థిరపర్చుకున్నాడు.

పాటలీపుత్రంలో ప్రవేశించగానే అజయుడిలో ద్వేషాగ్నులు రగులుకొన్నాయి. తమ వంశాన్ని తుదముట్టించాలని ప్రయత్నించిన నలుగురి వంశాల వారి వివరాలు తండ్రి ద్వారా ఎన్నోసార్లు విన్న అజయుడు, పాటలీపుత్రంలో ప్రస్తుతం ఆ వంశాలవారు ఎక్కడెక్కడ ఉన్నదీ తెలుసుకో

గలిగాడు. ఎనమండుగుర్ని అదృశ్యరూపంలో అతి సులువుగా అంగవికలులుగా చేసి అయిదో రోజు కల్లా గురుకులం చేరుకున్నాడు. పాటలీపుత్రం గగ్గోలెత్తింది.

పశ్చిమ దిశగా వెళ్ళిన కోశాధికారి కొడుకు కుబేరుడు విదర్భ రాజధాని ముంబేశ్వరీ నగరాన్ని అదృశ్యరూపంలో చేరుకున్నాడు. ఆ నగరంలో చాలా ధనవంతులైన వణిక్ప్రముఖులెందరో ఉన్నారు. ఒక ధర్మశాలలో చేరిన ఓ దొంగల ముఠా వేసిన పథకాల్ని అదృశ్యరూపంలో విన్న కుబేరుడు, నగరంలో ఉన్న కొందరు ధనికుల గృహాల నుంచి చాలా విలువైన వజ్రాల్నీ, మణిహారాల్నీ తస్కరించాడు. నగర వాణిజ్య ప్రముఖులు ఈ దొంగతనాలతో గజగజ వణికిపోయారు. ఆరితేరిన దొంగల ముఠా విస్తుపోయింది. అయిదో రోజు కల్లా కుబేరుడు గురుకులం చేరాడు.

గోపన్న కూడా తను అదృశ్యరూపం పొందిన సంగతి గ్రహించాడు. గోపన్న తన గోవుల్ని వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. రెండో రోజు సాయంత్రం యథాప్రకారం ఎవరి గోవుల్ని వారి గోశాలలకి తరలించి నందుని అనుమతి తీసుకుని కౌశాంబి నగరంలోకి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రి ఓ నాటక మండలి, నాట్యమందిరంలో 'ఉషాపరిణయం' నృత్యనాటిక ప్రదర్శిస్తోంది. ప్రవేశరుసుము పావు రాగి వరహా చెల్లించి లోపలికి వెళ్ళాలి. గోపన్న దగ్గర ఎర్రని ఏగాని కూడా లేదు. అదృశ్యరూపంలో లోపల ప్రవేశించి ఓ మూలగా నిల్చుని చూసే అవకాశమున్నా, ఆ విధంగా చెయ్యడానికి గోపన్నకి మనసొప్పలేదు. ఆ రాత్రి తన పాకలో పడుకొని, మర్నాడు సూర్యోదయం అవుతూండగా గోవుల్ని గురుకులం వైపు తోలుకుపోయాడు.

విదర్భ దేశానికి రాజైన భయంకరుడి కుమారుడు నీలుడు కూడా నందుని గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఆ దేశపు సైన్యాధికారి ఇరువురు వేగుల్ని కౌశాంబి రాజ్యంలోకి పంపి. గురుకులంలో చదువుతోన్న నీలుణ్ణి వధించమని పురమాయించాడు. ఆ వేగులిద్దరూ గురుకులం దరిదాపుల్లో రహస్యపుటాలోచనలు చేస్తూండగా గోపన్న విన్నాడు. నీలుడు హత్యగావించబడ్తే కౌశాంబి రాజు ధర్మపాదుడు సమాధానమిచ్చుకోవలసి వస్తుంది. భయంకరుడు దండెత్తి ధర్మపాదుని రాజ్యాన్ని కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇదే అదనుగా వెన్నుపోటు పొడిచి, కొంతమంది విద్రోహకారుల అండతో రెండు రాజ్యాల్నీ కబళించడానికి పథకం వేశాడా సైన్యాధికారి.

గోపన్న వెళ్ళి నందునికి పరిస్థితి వివరించాడు. నందుడు తన గురుకుల వాసుల సహాయంతో ఇరువురు వేగుల్నీ బంధించి, ఇరువురు రాజులకీ రహస్యంగా వర్తమానం పంపాడు. విదర్భ రాజు భయంకరుడు వెంటనే తన సైన్యాధికారిని బంధించి, ధర్మపాదునితో మరింత మైత్రీభావం పెంచుకొని, గురుకుల నిర్వహణకు మరింత ధనసహాయం తన రాజ్యం తరపున అందిస్తానని వాగ్దానం చేశాడు.

అయిదో రోజు సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో మహేశ్వర యోగి గురుకులానికి వచ్చాడు. నందుని సమక్షంలో అయిదుగుర్నీ తలల మీద చేతులుంచి దీవించాడు. వసంతుడూ, వేదుడూ, అజయుడూ, కుబేరుడూ, యోగి ఇస్తానన్న వరాల సంగతితో సహా జరిగినదంతా

మరిచిపోయారు. కుబేరుడు తస్కరించిన మణిమాణిక్యాల్ని విదర్భ రాజు కింద అందచేసే ఏర్పాట్లు చేశాడు నందుడు.

మహేశ్వరయోగీ, నందుడూ, కౌశాంబిరాజు ధర్మపాదుడికి జరిగినదంతా చెప్పి, "వీరు నలుగురూ లభించిన శక్తిని దుర్వినియోగం చేశారు. అందుచేత రాజ్యానికీ, పదవులకీ అర్హులు కారు. గోపన్న ధర్మనిరతి, రాజభక్తి మెచ్చదగింది. అతని పాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండి జనులు సుఖంగా ఉంటారు. న్యాయం నాలుగు పాదాలా నడుస్తుంది. ఏమంటారు?" అని ప్రశ్నించారు.

ధర్మపాదు డొక్కక్షణమాలోచించి, "మీరు చెప్పిన విధంగానే గోపన్నకి రాజ్యం కట్టబెడ్తాను. అతణ్ణి సకల విద్యాప్రవీణునిగా తీర్చిదిద్దండి. వీరు నలుగురికీ జన్మల నిచ్చిన తల్లిదండ్రులకి, నాతో సహా, మితిమీరిన పుత్రవాత్సల్యమూ, బంధుప్రీతీ ఉండకుండా అనుగ్రహించండి. వీళ్ళు నలుగురూ రేపు వంశానుగతమైన పదవులు పొందడం కోసం కుట్రలు చెయ్యవచ్చు. ప్రజ్ఞకు మించిన పదవులనాశించకుండా వారికి శాపాన్నీ, దేశానికి వరాన్నీ ప్రసాదించండి!" అని అర్థించాడు.

"తథాస్తు!" అన్నాడు మహేశ్వరయోగి.

ప్రజాక్షేమం కోరి ధర్మపాదుడు చేసిన త్యాగాన్ని ఎంతగానో ప్రశంసించాడు నందుడు.

❁ ❁ ❁

అందరూ ఉత్సుకతో విన్నారు. రాజకుమారుడైన వసంతుడి ఉదంతం చెబ్తూన్నప్పుడు, విద్యార్థినుల నుంచి అభ్యంతరాలు వస్తాయని భయపడ్డాను. కాని నట్టింట దూరదర్శన దృశ్యాలు చూసి చూసి రాటుదేలిన వాళ్ళు చిరునవ్వుతో నేను చెప్పిన కథ వినడంతో అనవసరంగా భయపడ్డాననిపించింది.

"ఇప్పుడు నేను నైతిక విలువలకి సంబంధించి ఓ నీతి కథ చెప్పాననే అనుకుంటున్నాను. కథ శ్రద్ధగా విన్నారు కాబట్టి ఓ ప్రశ్న అడుగుతాను సమాధానం చెప్పండి. ఏ దేవతలైనా లేదా ఏ క్షుద్రశక్తులైనా ఇలాంటి అద్భుత శక్తుల్ని మీకు ప్రసాదిస్తామంటే ఏమంటారు?" అన్నాను.

"ఓ అంటాం!" అన్నారందరూ ముక్త కంఠంతో, చివరి బల్ల మీద చివరగా కూర్చున్న ఓ విద్యార్థి తప్ప.

అతనికేసి చూశాను.

ఆ విద్యార్థి, "వద్దంటాను సార్!" అన్నాడు.

"ఏం, ఎందుకని?" ప్రశ్నించాను.

"లక్ష్యసాధనకు అడ్డదారులు మంచివి కాదు సార్! ఏ పని చేసినా నా శక్త్యానుసారమే చెయ్యడం నా కిష్టం సార్!"

పర్వాలేదు, దేశం పూర్తిగా భ్రష్టుపట్టి పోకుండా నూటికొకరు యిటువంటి వాళ్ళుంటే చాలు. అంతకంటే ఆశించడం దురాశే అవుతుంది. ❁

*(సుసర్ల వెంకట రమణమూర్తికి కృతజ్ఞతలతో.... రచయిత)*